

నీతికి నిర్వచనం

వి.ఎస్.వెన్నూరి

పక్కమీంచి లేచి మత్తుగా వొళ్ళు విరుచుకున్నాను.

కిటికీ తెర రెపరెపలాడింది. చల్లని గాలితెరొకటి కిటికీలోంచి రివ్వున దూసుకొచ్చి గిలిగింతలుపెట్టి పారిపోయింది. పక్కవాటాలో గోడగడియారం ఏడు గంటలు కొట్టింది. కాని, నిద్ర మత్తు పూర్తిగా వదల్లేదు.

మరోసారి గట్టిగా వొళ్ళు విరుచుకుని మంచందిగి లుంగీ సవరించుకున్నాను. టీపాయ్ మీంచి సిగరెట్టు పాకెట్టూ, అగ్గిపెట్టె అందుకున్నాను. ముఖంమీదికి జీరాడే ముంగురుల్ని వెనక్కి తోసుకుంటూ వీధిగుమ్మంవద్దకి చేరుకున్నాను. గడియతీసి బైటపడ్డాను.

బైట ప్రకృతంతా మసక వెలుగులో మట్టిపాములా మందకొడిగా పొర్లుతోంది. ఆకాశంలో కారుమబ్బులు దట్టంగా అలుముకున్నాయ్.

గుండెల్లో ఏదో బరువు!— అర్థంకాని ఆవేదన!—

బరువుగా నిట్టూరుస్తూ పిట్టగోడమీద చతికిల బడ్డాను.

ఆరోజు ఆదివారం. ఆఫీసుకు సెలవు. ఆఫీసులో అయితే కాలం రేసుగుర్రంలా పరుగెడుతుంది. శ్రీమతి లేని యింట్లో చీమనడక నడుస్తుంది! ఒంటరిగా—ఒక్క రోజంతా ఎలా గడపడం.

ఉన్నట్టుండి ఆకాశం మెరిసింది. ఉరుములు వురిమాయి. చల్లని యీదురు గాలి రివ్వున వీచింది. ఆ ర్చీ మీద అల్లుకున్న మల్లెతీగ గిలగిలలాడింది. ప్రేవుల్లోంచి పుట్టుకొచ్చింది చలి!—

కొంపదీసి ముసురుపట్టదుగదా? అంత పనీ జరిగితే గదిలోంచి కాలు కదపడానికి వీల్లేదు— ఈ నాలుగ్గోడల మధ్య నేరం చెయ్యని శిక్ష!—

గుండె మరింత బరువెక్కింది!— ఊపిరి అందడంలేదు. మరోసారి బరువుగా వూపిరి పీల్చుకుని పాకెట్టులోంచి సిగరెట్టు బైటికి లాగి అగ్గిపుల్లతో వెలిగించుకున్నాను. దమ్ము గట్టిగా లాగి గాల్లోకి వదలి, రింగు రింగులుగా తేలిపోయే పిల్లమేఘాలకేసి కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయాను.

ఆ పిల్లమేఘాల చాటునుండి మెరుపులా మెరిసింది అనూరాధ! పిల్లిలా తొంగిచూచి, కొంటెచూపులు విసిరి, చిలిపిగా నవ్వింది!

ఏమిటా చూపులు? ఎందుకలా నవ్వుతోంది?

నా అసహాయతను ఎక్కిరిస్తోందా? నా అసమర్ధతను ఎత్తి చూపుతోందా? ఎంత గర్వం!

ఉక్రోషంతో వూగిపొయ్యాను.

ఛీ! యీ ఆడవాళ్ళని నమ్మకూడదు! వొట్టి స్వార్ధపరులు! ఎదురుగా వున్నంత సేపూ పల్లమాలిన ప్రేమంతా వొలకబోస్తారు! నువ్వే నా లోకం అన్నట్టు ప్రవర్తిస్తారు. పుట్టింట కాలుబెడితేచాలు పుస్తెగట్టినవాడ్ని సైతం పూర్తిగా మరిచిపోతారు!

అనూరాధ పుట్టింటికెళ్ళి ఆరువారాలు దాటుతోందా? వారానికో వుత్తరం ముక్కయినా రాయదు. అధవా రాసిందిపో — తానెప్పుడు బయలుదేరేదీ రాయదు. అక్కడ తన తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ, వాళ్ళ సరదాలూ అవే రాస్తుంది. ఎవరిక్కావాలివన్నీ? ఇక్కడ నేనేమై పోతున్నా ఆవిడకేం దిగుల్లేదు! కనీసం చీమకుట్టినట్టయినా లేదు!

ఛీ! ఛీ! ఎంత స్వార్ధం!

ఆకాశం మరోమారు గర్జించింది. కత్తి ఝళిపించింది! ఈదురుగాలి ఎముకల్ని కొరుక్కుతినేస్తోంది! ముసురు పట్టడం ఖాయం!

అనూరాధే గనక వుంటేనా? యీ ఆదివారం ఎంత హాయిగా—ఆనందంగా గడిచిపొయ్యేది?

ముసురు పట్టితే ముణగదీసుకుని ఇంట్లోనే వుండిపోవచ్చు, సినిమాలూ షికార్లూ కట్టిపెట్టి.

కబుర్లు చెబుతూ, కవ్విస్తూ, కొంగు పట్టుకు తిరుగుతూ, ఏపనీ చెయ్యనివ్వ కుండా ఏడిపిస్తూ...

అబ్బో! అనూరాధకి ఎంతలావు కోపమొచ్చేదని! కోపం ఎప్పుడూ కొన ముక్కుమీదనే వుంటుంది అనూరాధకి. కోపమొచ్చినప్పుడు చూడాలి—అనూరాధ ఎంత అందంగా వుంటుందని!

నిజం కోపం కాదుసుమండీ! ఉత్తుత్తి కోపం. నిజానికి నేనంటే అనూరాధకి ప్రాణం! నన్నెప్పుడూ కొంగున కట్టుకు తిరగాలంటుంది. ఆమాటకొస్తే నేను మాత్రం? పెళ్ళయిన యీ మూడేళ్ళలో అనూరాధని విడిచిపెట్టి ఒంటరిగా వొక్కనాడైనా గడపగలిగానా?

ఇప్పుడైనా నా ప్రాణానికి ఆ బావ మరిదిగాడి పెళ్ళొకటి దాపురించివుండక పోతే కనీసం నా "ఆఫీసు మొగుడు" గిరి కడ్డునిలవకపోతే అనూరాధని విడిచిపెట్టి నేనిక్కడ యీ బ్రతుకు బ్రతికేవాడ్నా?

మా పెళ్ళయిం తరువాత యీ మహా పట్నంలో వొంటరి కాపురం పెట్టింతరువాత, రోజూ ఆదివారంకోసం ఎదురు చూచేవాళ్ళం! ఆదివారం వస్తోందంటే పండగ వస్తున్నట్టే!

అనూరాధ లేని ఆదివారం ఎంత భయంకరంగా వుంది!

అన్నయ్య పెళ్ళికని వెళ్ళిన ఆడది పెళ్ళి పూర్తవగానే బయలుదేరి వచ్చేయాలా? తనిల్లూ తన కాపురం ఛీ! ఛీ! యీ ఆడవాళ్ళకి బొత్తిగా బుద్ధిలేదు!

వెంటనే బయలుదేరి వచ్చెయ్యమని వుత్తరం రాద్దామని ఎన్నిసార్లో అనుకున్నాను. ఎంత చచ్చినా మగ మహారాజుని! అభిమానం చంపుకుని అలా రాశానా, అమ్మ బాబోయ్, ఇంకేముంది! అవతలివాళ్ళకి అలుసైపోనూ? ఆడదానికి అలుసిస్తే నెత్తికెక్కి కూర్చుంటుందట!

అయినా ఆవిడికిలేని అవసరం నాకేమిటి చెప్మా! ఎప్పు డొస్తుందో రానీ! నాకేం మగవాడ్ని! నా సుఖం నేను వెతుక్కోలేనూ?

చెర్నాకోలుతో ఎవరో వీపుమీద చెళ్ళుమనిపించి నట్టయింది. వులిక్కిపడ్డాను.

ఛీ! ఛీ! ఏమిటీ పాడుఆలోచన్లు?

ఆడది పుట్టింటికెళితే మగాడు వూరు మెయ్యాలా?

నేనేం అందరిలాంటి ఆకతాయిని కాను!

నీతిగా బ్రతుకుతున్న వాడ్ని! పెద్దమనిషిగా నలుగుర్లో తలెత్తుక తిరగ్గల వాడ్ని!

ఇలాంటి వెర్రిమొర్రి వేషాలు నా యింటావంటా లేవు!

చివరంటా కాలి వ్రేళ్ళని ముద్దుపెట్టుకుంది. సిగరెట్టు పీక. ఉలిక్కిపడి.



ఊహాలోకంలోంచి ఊడిపడి, సిగరెట్టు పీకను విసరికొట్టాను.

కిసుక్కున నవ్విందో చిలక !

ఎవరు చెప్మా నన్ను చూచి నవ్వింది?

దిగ్గున లేచి దిక్కులు పరికించాను. చిలక కంటబడింది. నా ప్రాణాలు పైపైనే ఎగిరిపోయినయ్. ఎవరో కాదా చిలక. పనిమనిషి పెద్దమ్మ కూతురు. దాని పేరు చిలకే. బొగ్గుల్లో రామచిలక. అది నవ్వింది నన్ను చూచికాదు. దానితో పరాచికాలాడుతోన్న పాపారాయుణ్ణి చూచి.

ప్రాణాలు కుదుటబడ్డయ్,

అయినా దృష్టి మళ్ళలేదు.

ఎదురుగా, రోడ్డుకవతల, కూలిపోయిన మదురుగోడ కావల, పూరిపాక ముందు, వొంగిన గంగిరావికొమ్మమీద, హొయలుగా వాలి ముత్యాలు వొలకబోస్తోంది చిలక? భుజంమీంచి జారిన చాలీచాలని పమిటను సర్దుకోకుండానే విరగబడి నవ్వుతోంది! నున్నటి బుగ్గలు సొట్టలు పడుతున్నయ్. పెదాలు ధనుస్సులా పొంగుతున్నయ్. పళ్ళు ముత్యాల్లా మెరుస్తున్నయ్.

నల్లగావుంటేనేం? అందంగానేవుంది సుమా!

కళ్ళు నలుపుకుని మరీ చూచాను. అందంగానే వుంది. ఆశ్చర్యపోయాను!

మూడేళ్ళుగా కనిపిస్తోన్న చిలకేనా యిది?

బాల్య మిత్రుడు సత్యం గుర్తుకొచ్చాడు. నిన్నటి రాత్రి పైలెక్కుతూ వాడన్న మాటలు గుర్తుకొచ్చినయ్.

"రంభలాంటి పిల్ల చిలక! అరచేతిలో ఆమలకం! అయినా ఏం ప్రయోజనం? అజీర్ణ రోగివి నువ్వు!

మృష్టాన్న భోజనం నీకెం రుచిస్తుందిలే!

వాడామాట అంటూంటే నా శరీరం మీద తేళ్ళూ, జెర్రులూ పాకినట్టయింది. కడుపులో దేవినట్టయింది. వాడ్ని అమాంతం నమిలి మింగేద్దామన్నంత కోపమొచ్చింది.

కాని, యిప్పుడనిపిస్తోంది. సత్యాన్ని గ్రహించే శక్తేదో వాడిలో నిబిడీకృత మైవుందని. కాకపోతే మూడేళ్ళుగా చూస్తోన్నా నేను గ్రహించలేని ఓ నగ్న సత్యాన్ని అయిదురోజుల అత్యల్ప కాలంలో వాడెలా గ్రహించగలిగాడు?

"ఒరేయ్ ! మడిగట్టుక్కూచుంటే అందుబాటులోవున్న అవకాశం కాస్తా జారిపోతుంది. దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకోమన్నారు. యవ్వనం జారి పోకముందే అందాన్ని అనుభవించి పారెయ్యాలి! స్వర్గమూ, నరకమూ, అనేవి ఎక్కడో లేవురా బ్రదర్ ! మన చేతుల్లోనే వున్నయ్ ! బ్రతికినన్నాళ్ళూ హాయిగా, ఆనందంగా గడిపెయ్యాలి జీవితాన్ని. ఆదర్శాలను వల్లిస్తూ ఆత్మవంచన చేసుకునే వాళ్ళంటే నా కసహ్యం. లక్షలు సంపాయించి నయాపైసాకు గడ్డికరిచే లోభీ, ఆద ర్శాల చాటున ఆత్మవంచన చేసుకునే భ్రష్టుడూ ఒక్కటే నా దృష్టిలో. అందు కనే నువ్వంటే నా కసహ్యం !"

బండి కదిలేదాకా వసపిట్టలా వాగుతూనే వున్నాడు.

లోతుగా ఆలోచిస్తే వాడిమాటల్లో నిజంలేకపోలే దనిపిస్తోంది. అసలు బలహీనతల్లేనివాళ్ళెంత మంది ? అందమైన వొంపులు కనిపిస్తే దొంగ చాటుగానైనా తొంగిచూడాలని ప్రయత్నించేవాళ్ళే అందరూ. నాకు మాత్రం లేవూ ఆశలు ! కాకపోతే నాకా ధైర్యం లేదు. చొరవలేదు. చాకచక్యం లేదు. అనుభవించే అదృష్టం లేదు .

తమ అసమర్థతనూ, పిరికితనాన్నీ 'నీతి' అనే ముసుగుక్రింద చాకచక్యంగా కప్పిపుచ్చుకునే నీతిపరు లెంతమంది లేరు ? ఆత్మవంచన చేసుకుంటూ అందర్నీ మోసంచెయ్యాలని ప్రయత్నించే వాళ్ళెందరు లేరు?—

నీతిని గురించి మాట్లాడే వాళ్ళందరూ నీతిపరులేనా ?— పెద్దమనుషులుగా చలామణీ అవుతున్న వారందరూ పెద్ద మనుషులేనా?— నాలాంటి 'నేతి బీరకాయలు' కోకొల్లలు!—

సత్యం అదృష్టవంతుడు. ఆదర్శాల చాటున ఆత్మవంచన చేసుకునే అవివేకి కాడు!—

మేము కాలేజీ వెలగబెట్టే రోజుల్లో వాడిచుట్టూ యీగల్లా ముసురుకునేవాళ్ళు అందమైన ఆడపిల్లలు !

వరూధినీ—వసంతా—సుందరీ—సుజాతా—

నాకూ వుండేది వాళ్ళతో కలుపుగోలుగా తిరగాలనీ, కబుర్లుచెప్పాలనీ,

సినిమాలకీ షికార్లకి చెక్కేయ్యాలనిను. కాని గుండె చాలేదికాదు. ఎదురుపడితే బెదురుపుట్టుకొచ్చేది. మాటలు తడబడేవి. ముచ్చెమటలు పోసేవి. బనహీనత బైట పడకుండా అతిజాగ్రత్తగా తప్పించుకు తిరిగేవాడ్ని.

వరూధిని కాబోలు నాకు ప్రవరాఖ్యు డనే బిరుదు కూడా ప్రసాదించింది!—

సత్యంగాడంటే వాళ్ళెందు కలా పడి చచ్చేవాళ్ళు? వాడికంటే అందగాళ్ళు లేరనా? తెలివితేటల్లో బృహస్పతిని తల దన్నాడనా?—

కాదు! వాడికి చాలినంత గుండెబల ముంది! ఆడపిల్లల్ని ఆకర్షించే చాకచక్య ముంది!

అప్పుడు-అంటే చదువుకునేరోజుల్లో నేను స్వతంత్రుడ్ని కాను. తండ్రి చాటున బ్రతుకుతోన్న అర్భకుడ్ని! ఇప్పుడో? నేను అర్భకుడ్ని కాను. నా సుఖాన్ని నేను వెతుక్కోవడంలో ఎవ రికీ భయపడ నవసరంలేదు.

అరచేతిలో ఆమలకం చిలక! అందు బాటులోవున్న ఆనందం చిలక!—

వొళ్లు వేడెక్కింది! కోర్కెలు తరు వుల్లా తలెత్తాయి! ధైర్యంగా వూపిరి పీల్చుకున్నాను!—

ఆకాశం ఫెళఫెళా వురిమింది. కళ్ళు మిరుమిట్లు గొలిపేలా మెరిసింది. ఆమె తలెత్తి చూచింది. కళ్ళూ కళ్ళూ కలుసు కున్నాయ్. వొళ్ళు ఝల్లుమంది. వేడె క్కిన శరీరం పోయింది. గుండెలు జారిపోయినట్టు.

పనిపిల్ల పమిట సర్దుకుంది. పాపా రాయుడు పలాయనం చిత్తగించాడు.

చిలక పనిపిల్లయితేనేం? అదీ ఆడదే! దానికీ మానాభిమానాలుంటాయ్. నేనలా చూడ్డం గమనించి ఏమనుకుందో!

"ఏఁవిటి పంతులూ? ఏఁవిటా చూపులు? నేనేం బజారుముండ నను కున్నావా?" అని నిలేసి ప్రశ్నిస్తే నేనేం చెప్పను?—

ఎంత బుద్ధితక్కువ పనిచేశాను?—

గుండె వేగంగా కొట్టుకుంటోంది! వొళ్ళంతా చెమటలు కక్కుతోంది! తల తిరుగుతోంది! ఒక్క క్షణం కూడా అక్కడనిల్చోలేకపోయాను. గిరుక్కున వెనక్కి తిరిగి రెండంగల్లో గదిలోకి చేరుకున్నాను. వీధితలుపులు బిడాయించి హాల్లో కాలుగాలిన పిల్లిలా పచార్లు ప్రారంభించాను.

వెధవబుర్ర వెర్రివెర్రి ఆలోచనల్తో వేడెక్కిపోతోంది.

ఇప్పుడేమిటి చెయ్యడం?—ఈఆపద లోంచి బైటపడడం ఎలా?— ఇంత కాలంగా నిలబెట్టుకున్న మంచిపేరు యీ ఒక్క సంఘటనతో మట్టిగొట్టుకు పోవలసిందేనా?—

దీని కంతటికీ కారకుడు ఆ సత్యం గాడు. నవ్వుతూనే ఎంత విషం నూరి పోశాడు? నిర్మలమైన తటాకంలో రాయి

ఏలంటూ. ఎడిగినక ఆ మాటఅనకుండా వుంటే నాలో యీ ఆలోచన్లు తలెత్తే వేనా? అంత ధైర్యంగా దానికేసి అలా చూచేవాడ్నా?

అందుకనే సజ్జనసాంగత్యం చెయ్యమన్నారు. ఇలాంటి రాలుగాయి వెధవలతో స్నేహంచేస్తే యిలాంటి వెధవ బుద్ధులబ్బక మంచిబుద్ధు లెలా అబ్బుతాయి?

ఆ వెధవాయిని – ఆ సత్యంగాడ్ని ముక్కలు ముక్కలుగా కోసి కాకులకీ గ్రద్దలకీ వేసినా పాపంలేదు!–

సిగరెట్లమీద సిగరెట్లు వూదేస్తూ హాలంతా తెగ పచార్లుచేస్తున్నాను.

కదులుతోన్న కాళ్ళు అమాంతం ఆగిపోయినయ్.

గుండె గొంతుకలోకి ఎగదన్నింది!–

తలుపుమీద చప్పుడు!–ఎవరో తడుతున్నారు తలుపు!–ఇంకెవరు?–చిలకే!–

పమిటకొంగు నడుముకి బిగదీసి–నడ్డిమీద చేతులాన్చి–కళ్ళు పెద్దవి జేసి–కలకత్తా కాళిలా......

అమ్మ బాబోయ్!–ఇంకేమన్నా వుందా?–

ఇప్పుడెలా?–ఏమిటి చెయ్యడం?–

బుర్ర పనిచెయ్యడం లేదు.

దబ దబా బాత్తున్నారు తలుపు!–గుండెలమీద బాత్తున్నట్టుంది! – తలుపు తియ్యక తప్పదు!– కానున్నది కాక మానదు!–

జారె ధైర్యాన్ని ఎగదోసుకుంటూ గుమ్మంకేసి నడిచాను. కాళ్ళు తడబడుతున్నయ్. కళ్ళు తిరుగుతున్నయ్ ఎలాగో తమాయించుకుని తలుపు తీశాను.

గుమ్మంలో సాక్షాత్కరించింది చిలక!–

కలకత్తా కాళిలాలేదు!– అజంతా సుందరిలా వుంది!–అపర రతీదేవిలా వుంది!–అప్సరసలావుంది!–

ముఖంమీదికి జీరాడే ముంగురుల్ని ఎగదోసుకుంటూ మందారంలా నవ్వింది! తొలగిన పమిటెను సర్దుకుంటూ సిగ్గుతో మొగ్గలా ముడుచుకుపోయింది! బరువుగా వాలిన కనురెప్పలు రెపరెప లాడాయి!

ఎవరో గట్టిగా వీపుమీద చరచినట్టయింది. ఎగిరిపడి పక్కకి తొలగి దారిచ్చాను.

నన్ను రాచుకుంటూ, వయ్యారాలు వొలకబోసుకుంటూ, వాల్జూపులు విసురుకుంటూ వంటగదికేసి వెళ్ళిపోయింది చిలక!

తలుపు దగ్గరికివేసి, పక్కనున్న కుర్చీ దగ్గరకులాగి, వుసూరుమంటూ అందులో కూలబడ్డాను.

పమిటకొంగు నడుముకి బిగదీసి–నడ్డిమీద చేతులాన్చి–కళ్ళుపెద్దవిజేసి–కలకత్తా కాళిలా దర్శనమివ్వాల్సిన చిలక. అజంతా సుందరిలా–అపర రతీదేవిలా–అప్సరసలా సాక్షాత్కరించిం దేమిటి చెప్మా!–



ఆశ్చర్యం ముంచుకొచ్చింది. మస్తిష్కం మొద్దుబారింది. రెండు నిముషాల పాటు స్థాణువులా కూచుండి పోయ్యాను.

మస్తిష్కంలో ఏదో కలుక్కున మెరిసింది.

అవును. యిదేం పత్తిత్తు కాదు!—

పక్కింట పనిచేసే పాపారాయుడితో పరాచికా లాడుతుండగా నేనెన్నిసార్లు చూళ్ళేదు! అంతెందుకు? నాబాల్యమిత్రుడు సత్యంగాడు దీన్ని గురించి అంతగా పొగిడాడంటే అర్థం ఏమిటి? కిలాడీ వెధవ. దీన్ని రంగంలోకి దించే వుంటాడు!—

వయసులోవున్న ఆడది. పెళ్ళికూడా అయిందట. వాడే దీన్ని వొదిలేశాడో ఇదే వాడ్ని వొదిలేసిందో—ప్రస్తుతం తల్లి దగ్గరుంటోంది. తల్లీ కూతుళ్ళిద్దరూ చాకిరీ చేసుకుంటారు. కూటికీ గుడ్డకీ లోటులేదు. వయసులోవున్న ఆడదానికి కూడూ గుడ్డా దొరికితే చాలా? అన్ని అవసరాలూ తీరినట్టేనా?—

గుండెలుకుదుటబడ్డయ్. అనవసరంగా హైరానా పడ్డందుకు నాబాధ నాకే జాలేసింది. మెల్లగా లేచి చిన్నగా వంట గదికేసి నడిచాను.

చిలక చీపురు చేతపుచ్చుకుని ఇల్లు వూడుస్తోంది. పలచటి బట్టల్లోంచి వొంట్లోని వొంపులన్నీ స్పష్టంగా కనిపిస్తున్నయ్.

శరీరం వేడెక్కుతోంది! కోర్కెలు పడగలెత్తి త్రాచుల్లా బుసకొడ్తున్నయ్!

అడుగు ముందుకివేసి గుమ్మంవద్ద నిల్చున్నాను.

ఎలా కదపాలో అర్థంకావడం లేదు.

నా ధైర్యాంచను అడిగస్తే?—

అవును "ధైర్యే సాహసే లక్ష్మి" అన్నారు పెద్దలు!—

కొంపదీసి వ్యవహారం బెడిసికొట్టదు కదా?—

నా పరువూ, ప్రతిష్టా ఏంకాను? —

నలుగుర్లో నేను తలెత్తుకు తిరగగలనా?—

అర్థంపర్థంలేని ఆలోచనకి నవ్వొచ్చింది!

ఛీ! ఛీ! ఏఁవిటీ వెధవ ఆలోచన్లు? సుఖపడదలచుకున్న వాడికి ఆమాత్రం ధైర్యం లేకపోతే ఎలా?—

గొంతు సవరించుకున్నాను. 'చిలకా!' అన్నాను మెల్లగా. నా గొంతు నాకే వినిపించలేదు. కాని చిలక్కి వినిపించింది కాబోలు వెనక్కి తిరిగి చూచింది.

గొంతులో పచ్చివెలక్కాయ పడింగి

నా అవస్త నర్థంచేసుకుంది కాబోలు చిలక, వొంగి ఇల్లుతుడుస్తోన్నదల్లా లేచి నిల్చుని, సూటిగా నా కళ్ళల్లోకి చూస్తూ, ముంగురులు సవరించుకుంటూ "పిలిచారా?" అంది.

దాని ప్రశ్నకి ఏం చెప్పను జవాబు?—

కంగారు ముంచుకొచ్చింది. రక్తం తల కెగజిమ్మింది. కళ్ళముందు చీకట్లు కమ్మాయి. వెంటనే సంబాళించుకొన్నాను. అవునన్నట్టు తలూపాను.

"అబ్బే—మరేంలేదు—మీ అమ్మ కనిపించండంలేదు—వూళ్ళో లేదేమోనని... ..."ముందూ వెనకా ఆలోచించకుండా నోటికొచ్చిందేదో వాగేశాను.

"మరేనండి! నా మేనత్తకూతురు నీళ్ళాడిందని కబురొస్తేవూరెళ్ళిందండి!" పమిట సర్దుకుంటూ వొయ్యారాలు వొలకబోసింది చిలక.

"అయితే — యిప్పుడప్పుడే తిరిగి రాదన్నమాట?"

"మరేనండి. నిన్నేకదండి వెళత? మరో వారంరోజులైనా పడుతుంది"

నాక్కాస్త వూపిరందింది.

"అవిడొచ్చేదాక—ఆ పూరిపాకలో— నువ్వొక్కతే..."

చిలకి అర్థంకానట్టు కనుబొమలు ముడివేసింది.

"అబ్బే—అదికాదు—వయసులో వున్న ఆడదానివి—రాత్రిళ్ళు—వొంటరిగా—ఆ పూరిపాకలో......"

"అహాఁ, అదా?" కళ్ళు పెద్దవిచేసి, కనుబొమలు ఎగరేసి కిలకిలా నవ్వేసింది చిలక. వెంటనే ముంచుకొచ్చిన సిగ్గుతో తలవొంచేసుకొని, పమిట సర్దేసుకుంటూ "మరేం ఫరవాలేదులెండి! నన్నెవరూ ఎత్తుకుపోరు!" అంటూ మరోసారి తలెత్తి నాకళ్ళల్లోకి చూచి, పెదవి విరిచి చిన్నగా నవ్వింది.

ఆ చూపులు తిన్నగా నా గుండెలోకి దిగబడిపోయినయ్. ఊపిరందక వుక్కిరిబిక్కిరైపొయ్యాను. వెంటనే తమాయించుకుని చిన్నగా నవ్వేశాను.

చిలక తన పనిలోకి తాను వెళ్ళి పోయింది.

నేను తిన్నగా హాల్లోకి చేరుకున్నాను. ఆలోచిస్తూన్నాను. ఆలోచించే కొద్దీ ఆశ్చర్యం ముంచుకొస్తోంది! వయసులో వున్న ఆడదానితో యింత చనువుగా, ధైర్యంగా మాట్లాడగల వాకచక్యం నాలో వుందన్న విషయం మొట్టమొదటిసారిగా తెలుసుకున్నాను.

దేనికయినా సమయమూసందర్భమూ కలిసిరావాలి! అంతవరకూ తమలో దాగివున్న శక్తులు బైటపడవు. సత్యం గాడనుకున్నట్టు నేనేం అసమర్థుడ్నికాను. నాకూ సుఖపడేయోగం లేకపోలేదు!—

అందుబాటులోవున్న అందగత్తె చిలక!—

అందుబాటులోవున్న అందాన్నిసైతం అందుకోలేకపోతే నా ప్రయోజకత్వం ఏముంది?—

గిరుక్కున వెనక్కి తిరిగి చిలక కోసం గాలించాను. చిలక పక్కగది తుడుస్తోంది. మగధీరుడిలా రొమ్ము విరుచుకొని, అంగలేసుకుంటూ అక్కడికి చేరుకున్నాను. తీరా గుమ్మందగ్గరికి చేరేసరికి, కెవ్వుమని కేకవేసి, రివ్వుమని దూకి, నా కౌగిట్లో గువ్వలా యిమిడి పోయింది చిలక!

గుభిల్లుమని జారిపోయినియ్గుండెలు. వెన్నెముకలోంచి పుట్టుకొచ్చింది చలి! కొమ్మనుకొని కొండచిలువను కావులించుకున్నట్టు గగుర్పొడిచింది శరీరం! కౌగిలి విడిపోయింది!

జారిన పమిటను సర్దుకుంటూ, కుచ్చెళ్ళు దులుపుకుంటూ, తన్ను భయపెట్టి పారిపోయిన చిట్టెలుకను తెగ తిట్టేస్తోంది చిలక!

పిల్లిలా జారుకున్నాను హాల్లోకి. జరగరానిది జరిగినట్టూ, చెయ్యరానిపని చేసినట్టూ యిబ్బందిగా హాలంతా చిందులు తొక్కాను.

కాస్సేపటికి చిలక వచ్చి, 'వెళతా' అంటే తలొంచుకుని గంగిరెద్దులా తలూపానే కాని దాని కళ్ళల్లోకి చూళ్ళేకపోయ్యాను.

వెళతానన్న చిలక వెళ్ళలేదు. పమిటచెంగు చూపుడువ్రేలికి చుట్టుకుంటూ, నేలచూపులు చూస్తూ అక్కడే ఆగిపోయింది.

గతుక్కుమని కంగారుగా తలెత్తి చూశాను.

చిలక చిర్నవ్వు చిలకరించింది "అమర్లోకి కొత్త సినిమా వొచ్చింది' నసుగుతోంది. తొలగని పమిట జారుకుంటోంది.

"వెళతావా?" ధైర్యంగా అడుగు ముందుకేశాను.

అవునన్నట్టు తలూపింది "అది (అమ్మ) వస్తే వెళ్ళనివ్వదు" ఫిర్యాదు చేస్తున్నట్టు బుంగమూతి పెట్టింది.

"పైసలు కావాలా?"

నవ్వింది.

మగధీరుడిలా ముందుకి నడిచి, పక్క గది చేరుకుని, రెండు రూపాయల నోట్లు పట్టుకొచ్చి దాని చేతిలో బెట్టాను. చిలక నోట్లని జాకెట్టులో దోపుకుంటూ కృతజ్ఞతగా నాకళ్ళలోకి చూచింది. చిలక మచ్చికై పోయిందనడానికి యింతకంటే ఏంకావాలి? ధైర్యంగా వొంగి దానిచేతి నందుకున్నాను.

"అబ్బ! వూరుకోండి! ఎవరైనా చూస్తే..." చిలక సిగ్గుపడిపోయింది

ఆడదానికి సిగ్గే సింగారమన్నారు. కాదు మగవాడ్ని రెచ్చగొట్టడానికీ, ఎంతటైనా తెగించేధైర్యాన్ని పురికొల్పడానికీ అంతకంటే అస్త్రం మరోటి లేదు.

"ఇక్కడున్నది మనమిద్దరమేగా? ఎవరున్నారు చూడ్డానికి?..." మరింత దగ్గరికి లాక్కున్నాను.

"అమ్మో!—పట్టపగలే!" కళ్ళుపెద్దవి చేసి, నోరు సున్నాలా చుట్టింది చిలక!

"పోనీ—" ముందుకి వొంగి చెవిలో రహస్యం చెప్పాను.

చిలక మాట్లాడలేదు. సిగ్గుతో తల వొంచేసుకుని, అలాగే అన్నట్టు తలూపేసింది

"నీకోసం ఎదురుచూస్తూ వుంటాను"

"ఊఁ" ఓ చిరునవ్వు, ఓ చిలిపి చూపూ చిలకరించి, లేడిలా గెంతుకుంటూ, మెరుపులా మాయమైంది!

ఎగిరి గంతేశాను. తిన్నగా పక్క గదిలోకి పారిపోయి నిలువుటద్దంముందు నిల్చున్నాను.

"ఉరేయ్! నువ్వింత ప్రయోజకుడి వన్న విషయం క్రితం క్షణంవరకూ నాకు తెలీదుసుమా! ఆరిగడుగ్గాయ్! ఎంత అనుభవజ్ఞుడిలా ప్రవర్తించావురా! చిలకలాంటి అందాలభరిణెను ఎంత సునాయాసంగా బుట్టలో వేసుకున్నావ్!"

నన్ను నేను అభినందించుకున్నాను.

చకచకా స్నానంచేసి బట్టలు తొడుక్కుని చక్కగా ముస్తాబయ్యాను. తలుపులు మూసి హుషారుగా యీలవేసుకుంటూ మెట్లకేసి బయలుదేరాను. మెట్లు దిగుతూ తలెత్తి ఆకాశంలోకి చూశాను. అంత క్రితం అలుముకున్న ఒక్క నీలిమేఘమూ కనిపించలేదు. నా మనసులాగే స్వచ్ఛంగా అద్దంలా మెరిసిపోతోంది ఆకాశం!

కమ్మని కలలుగంటూ అయ్యరు హోటలుకేసి బయలుదేరాను.

వీధి చివర పచ్చ మేడముందు జనం మూగారు యీగల్లా. ఇల్లుగలావిడ శోకాలుపెడుతూ మధ్య మధ్య ముక్కు చీదేస్తోంది. ఇల్లుగలావిడ పెళ్ళిగాని కూతురు ప్రమీలారాణీ, ఎదురింట్లో కాపురముంటోన్న సుబ్బారావూ పొద్దుట్నించీ కనిపించడం లేదట.!

"పెళ్ళయిన వెధవ వాడి కామాత్రం బుద్ధుండక్కర్లా?" అంటోందో పెళ్ళ

యువ



యిన ఇల్లాలు, బుగ్గలు తెగనొక్కేసుకుంటూ, తప్పంతా సుబ్బారావుదే అన్నట్టు! నాకంతా అర్థమైపోయింది. ఆ యిల్లాలిమీద కొండంత కోపంకూడా వొచ్చింది.

“పుట్టింటికెళ్ళిన పునిస్త్రీ పుస్తెకట్టిన వాడ్ని సైతం పూర్తిగా మరిచిపోయి పుట్టిల్లు వొదలిరాకపోతే, సుబ్బారావే కాదు, అప్పారావయినా అంతే చేస్తాడు” అనుకున్నాను కసిగా.

తిన్నగా అయ్యరు హోటల్ చేరుకున్నాను.

గబగబా నాలుగు మెతుకులు కొరికి కౌంటర్ లోంచి బైటపడి వరండాలో కొచ్చాను.

“దండాలండి బాబయ్యా” అంటూ దర్శనమిచ్చాడు ఆఫీసు బంట్రోతు అప్పన్న.

గుండెల్లో కొండలు దొర్లించినట్టయింది.

ఆఫీసురోజుల్లో అందరికీ బంట్రోతులాగే కనిపించే అప్పన్న సెలవురోజుల్లో మాత్రం యమకింకరుడిలా దర్శనమిస్తాడు. యమకింకరుడు దర్శన మిచ్చాడంటే యమునివద్దనుండి పిలుపొచ్చిందన్నమాటే.

“ఏం అప్పన్నా, ఏమిటిలావచ్చావ్?” లోలోపల తిట్టుకుంటూ, పెదాలకి నవ్వు నతికించుకుని, ఆప్యాయంగా పలకరించాను.

" మనేజర్ బాబు ఓమాటు మిమ్మల్ని అర్జంటుగా పిలుచుకు రమ్మన్నారు. ఏవో అర్జంటు కాగితాలు కావాలట" చావు కబురు కాస్తా చల్లగా జారవిడిచాడు అప్పన్న.

యముడు అసలే ఛండశాసనుడు. పులివాత బడ్డ లేడి తప్పించుకు పారిపో వచ్చు. యమకింకరుడి కంటబడ్డ గుమాస్తా ప్రాణాలతో బైటపడలేడు. వెళ్ళక తప్పదు!

కిక్కురుమనకుండా అప్పిగాడి వెంట బయలుదేరాను.

యముడి కబంధహస్తాల్లోంచి బైట పడేసరికి రాత్రి ఏడు దాటింది. సాధించిన ఘనవిజయాన్ని తలుచుకుంటూ మురిసి పోవలసిన అమూల్యకాలాన్ని, తినబోయే రుచుల్ని వూహించుకుంటూ గడపవలసిన మధురక్షణాలని, అమాంతం కబళించి, వుండగా చుట్టి కబళంలా ఆరగించిన మేనేజర్ బకాసురుడి దౌష్ట్యాన్ని, గుమాస్తాగాడి చేతగానితనాన్నీ తెగ తిట్టు కుంటూ బయలుదేరాను.

సాయింత్రం కాఫీ కూడా లేదు. ఆకలితో కడుపు దహించుకు పోతోంది. ఎలాగూ ఏడు దాటింది కనుక అయ్యరు హోటల్‌కేసి దారితీశాను. అయ్యరు వడ్డించిన సాంబారు మెతుకుల్ని సుష్టుగా ఎక్కించి, బుగ్గన కిళ్ళీ దట్టించి, సిగరెట్టు వెలిగించి వీధిన పడ్డాను.

హుషారుగా వుండవలసిన మనసు వుండగా ముడుచుకుపోయింది. ఎంత సాగదీసి వొదిలినా రబ్బరుచుట్టలా ముడు చుకుపోతూనేవుంది. అర్థం పర్థంలేని అనుమానాలు!

మా వీధి మొగసాల చిన్న జాతర జరుగుతోంది.

అప్పచ్చులమ్ముకునే అబ్బి, మొగు డొదిలేసిన మంగీ జుట్టూ జుట్టు పట్టు కుని వీధిలో పొర్లుతున్నారు. కోడి పుంజుల్లా పోట్లాడుతున్నారు. జనం తమాషా చూస్తున్నారు.

విచారణమీద విషయం తెలిసింది.

అచ్చి మొగుడు బుచ్చిగాడూ మొగు డొదిలేసిన మంగీ చీకటి గొందిలో మంతనాలాడుతుండగా అచ్చి మాటేసి ఆ యిద్దర్నీ పట్టేసిందట.

అచ్చి అప్పచ్చులమ్ముకునే దయితే నేం?—అదీ ఆడదే!—పుస్తె కట్టిన పురుష పుంగవుడు మరో ఆడదానితో సరసా లాడుతుంటే చూచి ఏ ఆడది ఓర్చుకో గలదు?—

చల్లని గాలితెరొకటి రివ్వునవీచింది!—

వెన్నెముకలోంచి పుట్టుకొచ్చింది చలి!—

ఆ మాట కొస్తే అనూరాధా ఆడదే!—నేను చిలకతో చేతులు కలిపానని తెలిస్తే అనూరాధ మాత్రం ఓర్చుకోగలదా?—

దొంగతనం గానీ, రంకుతనం గానీ దాస్తే దాగేవి కావు!—



ఇప్పుడేమిట చెయ్యడం ?—

నా పరువు రచ్చకెక్కవలసిందేనా ?—

ఆ దాసీపిల్లను ఆపడం ఎలా ?—

భగవాన్! నన్నీ ఆపదలోంచి రక్షించేందుకు నువ్వు తప్ప అన్యధా శరణం నాస్తి!—

గుండె వేగంగా కొట్టుకుంటోంది. కాళ్ళు తడబడుతున్నయ్. నడక సాగడం లేదు. ఎలాగో ఇల్లు చేరుకున్నాను. మేడ మెట్లెక్కి వరండాలోకి చేరుకునే సరికి వేగంగా కొట్టుకుంటోన్న గుండె కాస్తా చటుక్కున ఆగిపోయింది.

ఎదురుగా—వరండాలో— మసక వెలుతుర్లో ఓ స్త్రీ మూర్తి తచ్చాడుతోంది!—

ఇంకెవరు? చిలకే! ఆడినమాట తప్పని హరిశ్చంద్రుని చెల్లెలు! నాదుంప తెంచడానికి—నా పరువు నట్టేట్లో కలపడానికి—నన్నల్లరిపాలు చెయ్యడానికి—

"అదేమిటండి, అలా ఆగిపొయ్యారు? అకస్మాత్తుగా వూడిపడ్డానని ఆశ్చర్యంగా వుందా?"

ఏమిటిది? —కలా?— నిజమా?—

కళ్ళు నలుపుకున్నాను. చెయ్యి గిల్లుకున్నాను. కలగాదు. నిజమే!— చిలక్కాదు. అనూరాధ!—

ఉత్తరం ముక్కయినా రాయకుండా ఉన్నపళాన బైలుదేరి రావడానికి కారణమేదో చెబుతోంది శ్రీమతి. వినే ఓపిక లేదు. అర్థం చేసుకునే వ్యవధి లేదు.

భగవంతుడు దయామయుడు! తన భక్తుల్ని ఇలాగే కాపాడుతూ వుంటాడట!—

మరో క్షణం ఆలస్యం జరిగివుంటే నేనా పాపపంకిలంలో కుత్తుక దాకా కూరుకు పొయ్యేవాణ్ని!—

సమయానికి అడ్డుపడి, ఎంత తేలిగ్గా ఆదుకున్నాడు!—

అడుగుముందుకివేసి తలుపుతాళం తీశాను.

పుట్టింటి కబుర్లు చెబుతూనే వంట పనిలో కూరుకుపోయింది అనూరాధ.

బుర్ర వేడెక్కేలా ఆలోచిస్తూ మంచంమీద వాలిపొయ్యాను. స్నాన పానాలు ముగించుకుని అనూరాధ అక్కడికి చేరుకునేసరికి మరో గంట గడిచిపోయింది.

"ఏమిటో శ్రీవారు దీర్ఘంగా ఆలో చిస్తున్నట్లున్నారు?" మీదికి వొంగి చిలి పిగా కళ్ళల్లోకి చూచింది అనూరాధ.

చిన్నగా నవ్వి, పక్కకి జరిగి ఆవి డికి చోటిచ్చాను.

"విన్నారా? వీధి చివర సుబ్బారావు లేడూ, ఎదురింటి ప్రమీలారాణిని లేపుకు పోయాట్ట! పక్కింటి పార్వతమ్మ చెప్పింది."

ఆడవాళ్ళ కిలాంటి విషయాల్లో ఎంత ఆసక్తో, ఆశ్చర్యపొయ్యాను!

"అవునట, పాపం సుబ్బారావు! అతగాడి భార్య పుట్టింటికెళ్ళి మూడు మాసా లవుతోందిటగా?"

"ఏమిటీ?" నొసలు చిట్లించి క్వొశ్చెన్ మార్కు ముఖం పెట్టింది అనూరాధ. "పెళ్ళాన్ని పుట్టింటికి పంపే వాళ్ళంతా వూరిమీద పడుతున్నారా ?"

నాకు నవ్వొచ్చింది "పడకేంచేస్తారు? మగాడు మడిగట్టుకూర్చుంటాడా? నువ్విల్లు చేరుకోవడం మరో నాలుగు రోజులు ఆలస్యంచేసి వుంటే నేనూ అలాంటి అఘాయిత్య మేదో..."

అనూరాధ. "ఛ! ఏమిటా మాటలు! నీతి మాలిన వాడెవడో ఏదోచేశాడని అందరూ అలాచేస్తారా? మీరెలాంటి వారో నాకు తెలీదూ?" సున్నితంగా అరచేత్తో నా నోరు కప్పేసింది.

అనూరాధకి ఎంత విశ్వాసం నా మీద!—అవును మరి, ఆడదై పుట్టింతరు వాత పుస్తెకట్టినవాడిమీద ఆమాత్రం నమ్మకం లేకపోతే ఎలా?—

ఒక్కనాటితో తెగిపోయే బంధమా యిది?—

నా భార్య దృష్టిలో—లోకం దృష్టిలో నేను నీతిపరుడ్నే!— పరువుగా బ్రతుకు తోన్న పెద్ద మనిషిని!—

వెకిలిగా వోనవ్వునవ్వేసి, అప్యా యంగా చేతులు చాచి, అసలు రంగు బైట పడకుండా, అమాంతం మీదికి లాక్కొని అనూరాధతో కప్పేసుకున్నాను.

ఎవరో కిసుక్కున నవ్వారు—ఎక్కడో కాదు, నాలో—వెధవ, సత్యంగాడు నాలో తిష్టవేసుక్కూచున్నాడు.

"అందంగా అబద్ధాలాడే వాడూ, ఆత్మవంచన చేసుకునేవాడూ, అసమర్ధ తను కప్పిపుచ్చుకునేందుకు అడ్డదారులు వెతికేవాడూ అందరూ నీతిపరులేనా?— నీతికి నిర్వచనం ఏమిటి? — పిరికితనానికి మారుపేరా?"— ప్రశ్నలవర్షం కురిపిస్తు న్నాడు. చెవులు గింగురుమనేలా విరగ బడి నవ్వుతున్నాడు.